# పంచాయితీల కంటే పరిష్కారాలకే మొగ్గు

-మొదటిపేజీ తరువాయి

అనుమతులకు ఇప్పుడు అడ్డంకులు పెట్టవద్దని ఏపీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. "పాలమూరు – రంగారెడ్డితోపాటు కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్‌బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఉమ్మడి రాష్ట్రంలోనే అనుమతులు వచ్చాయి. ఇప్పుడు వీటికి అభ్యంతరాలు చెప్పవద్దు. ఈ అడ్డంకులతో పర్యావరణ, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయి. రుణాలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మాకు సహకరించండి" అని కోరారు. తాము వివాదం కోరుకోవడం లేదని, పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళ్లాలని, చర్చల ద్వారా సమస్యలకు సంపూర్ణ పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "అంతర్రాష్ట్ర నీటి వివాదాలపై ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాలతో చర్చలకు మేం సిద్ధం. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒక అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ పది అడుగులు ముందుకేస్తుంది. నీళ్ల వివాదాల ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచన మాకు లేదు. వివాదాలు చేయవద్దు. చర్చలు ఒక్కటే పరిష్కారం. న్యాయస్థానాలు లేదా ఇతరుల వద్ద పంచాయితీల కంటే మనమే కూర్చొని మన సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుందాం. రాజకీయాలకతీతంగా ఈ సమస్య పరిష్కారానికి అందరూ సహకరించాలి" అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. నీటి సమస్యలను పరిష్కరించేందుకే సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని తెలిపారు.

**పోర్టు కనెక్టివిటీ అవసరం**

రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోకపోతే సమస్యలు పరిష్కారం కావని, పక్క రాష్ట్రంతో చర్చలు కొనసాగుతాయని సీఎం రేవంత్ తెలిపారు. ఏపీతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలతో వివాదాలు కోరుకోవడం లేదని, పరస్పర సహకారమే కోరుకుంటున్నామని చెప్పారు. దేశంలో పోర్టు కనెక్టివిటీ లేని ఏకైక పెద్ద రాష్ట్రం తెలంగాణనేనని, తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ అవసరమని, సముద్ర మార్గంతో అనుసంధానం కావాలంటే ఆంధ్రప్రదేశ్ సహకారం తప్పనిసరని చెప్పారు. అందుకే, మచిలీపట్నం పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, దానికి సమాంతరంగా రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం సహకారం కోరుతున్నామన్నారు. "ఈ కనెక్టివిటీ రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. అయితే, పక్క రాష్ట్రం సహకారం, సయోధ్య లేకుండా ఇవన్నీ జరగవు. అందుకే ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవసరం. ఈ విషయంలో సంపూర్ణంగా మేం ముందుకు వస్తాం" అని సీఎం స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి హైదరాబాద్ సహకారం కూడా అవసరమేనన్నారు. హైదరాబాద్‌లో డేటా సెంటర్లు పెట్టేందుకు అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి విద్యుత్తుతోపాటు నీరు కూడా అవసరమేనని, కృష్ణా జలాలను తరలించాలన్నా.. పొరుగు వారితో పరస్పర సహకారం అవసరమని వివరించారు. భవిష్యత్తు అంతా ఫ్యూచర్ సిటీదేనని, ఇక్కడ భూముల ధరలు భవిష్యత్తులో అనేక రెట్లు పెరుగుతాయని, అందువల్ల ఈ ప్రాంత ప్రజలెవరూ భూములు అమ్ముకోవద్దన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం రాష్ట్రంలో ఉందని, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులు పెట్టే వారిని ప్రోత్సహించేందుకే ఈ కంపెనీ ప్రారంభోత్సవానికి తాను వచ్చినట్లు తెలిపారు.

**విద్యా రంగానికి సరికొత్త పాలసీ**

రాష్ట్రాభివృద్ధికి పారిశ్రామిక, విద్యుత్, పర్యాటక, దేవాదాయ, వైద్య రంగాల్లో ప్రభుత్వం పాలసీలు తీసుకొచ్చిందని, వాటిని సరళీకరించడమే కాకుండా విద్యా రంగంలోనూ సరికొత్త పాలసీని ప్రకటించబోతున్నామని సీఎం రేవంత్ తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీతోపాటు పెట్టుబడుల ఆకర్షణకు పారదర్శక ప్రణాళికలు రూపొందించామన్నారు. కొండా విశ్వేశ్వర రెడ్డి వంటి ప్రముఖుడు ఈ ప్రాంతానికి ఎంపీగా ఉండడం అదృష్టమని, పార్టీలకతీతంగా ఆయనతోపాటు అనేక మంది ప్రభుత్వ పాలసీలకు, ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్నారని కొనియాడారు.


**ప్రైవేటులోనే జీతాలెక్కువ**

"ప్రైవేటు రంగంలోనే జీతాలు అధికంగా ఉంటున్నాయి. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేటులో అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఇప్పటి వరకు మేం 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ఇంకా 30 లక్షల మంది నిరుద్యోగులు రాష్ట్రంలో ఉన్నారు. అందుకే, యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు ప్రైవేటు రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలి" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, టీజీఐఐసీ ఎండీ శశాంక, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ర్యాంకులు రావాల్సిందే!

హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు జాతీయ ర్యాంకుల సాధనలో ముందుండేలా చేయడంపై ఉన్నత విద్యా మండలి దృష్టి పెట్టింది. ఇతర అంశాలు పక్కన పెడితే అసలు దరఖాస్తు విధానంలోనే లోపం ఉందని గుర్తించి, వాటిని సరి చేసేందుకు నడుం బిగించింది. ప్రభుత్వ ఆదేశాలతో వాస్తవానికి దీనిపై గత కొంతకాలంగా ఉన్నత విద్యామండలి కసరత్తు చేసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో వర్సిటీలు ఎందుకు వెనుకబడ్డాయో గుర్తించింది. దరఖాస్తు విధానంలో లోపాలను అధిగమించేందుకు ప్రతి యూనివర్సిటీ నుంచి ఇద్దరికి దీనిపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు ప్రక్రియలో కీలక భూమిక పోషించే నోడల్ అధికారితో పాటు మరో వ్యక్తిని అవగాహన కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని భావిస్తోంది. దీనికోసం ఓ కన్సల్టెన్సీని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఈ నెల 21వ తేదీన మండలి కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తెలిపారు.




**ర్యాంకుల్లో వర్సిటీల వెనుకబాటు**

రాష్ట్రంలో వ్యవసాయ యూనివర్సిటీ సహా మొత్తం 13 విశ్వవిద్యాలయాలున్నాయి. ప్రతి సంవత్సరం ప్రకటించే జాతీయ ర్యాంకుల్లో ఇవి వెనుకబడుతున్నాయి. వందేళ్ళ చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాయానికి ఎన్ఐఆర్ఎఫ్ ఓవరాల్ విభాగంలో 2022లో 46వ ర్యాంకు వస్తే, 2023లో ఇది 64కు 2024కు 70కి పడిపోయింది. అయితే 2025లో 53వ ర్యాంకు సాధించడం కాస్త ఊరట కల్గించే అంశం. టాప్100 యూనివర్సిటీల ర్యాంకులో 2022లో 22వ ర్యాంకు దక్కించుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం 2025లో 30కి పడిపోయింది. సాంకేతిక విద్యకు కీలకమైన జేఎన్‌టీయూహెచ్ ఓవరాల్ ర్యాంకుల్లో అసలు పోటీలోనే లేకపోవడం గమనార్హం. కాగా టాప్100లో గత ఏడాది వందో ర్యాంకు దక్కించుకుంది. మిగతా వర్సిటీల్లో చాలావరకూ ఏమాత్రం పోటీ పడలేకపోతున్నాయి. అదే సమయంలో ప్రైవేటు విద్యా సంస్థలు జాతీయ ర్యాంకుల సాధనలో దూసుకుపోతున్నాయి. ఈ ర్యాంకులకు విస్తృతంగా ప్రచారం కల్పించి, సీట్లకు డిమాండ్ పెంచుకుంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది.

**దరఖాస్తులోనే లోపం**

అన్ని యూనివర్సిటీల్లోనూ బోధకుల కొరత ఉంది. 70 శాతం వరకు కాంట్రాక్టు అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నాయి. దీంతో నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటున్నాయనేది వీసీల వాదన. ఓయూకు గత కొన్నేళ్ళుగా కేంద్ర సంస్థల నుంచి రావాల్సిన ప్రాజెక్టులు 50 శాతం మేర పడిపోయాయి. ప్రొఫెసర్ల కొరత కారణగా పీహెచ్‌డీలూ తగ్గుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుకు దరఖాస్తు చేసే విషయంలో యూనివర్సిటీలు సరైన అవగాహనతో వ్యవహరించడం లేదు. విశ్వవిద్యాలయంలో మూడేళ్ళుగా విద్యార్థుల చేరిక, ఇతర దేశాల విద్యార్థుల సంఖ్య, ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్కులు, ఉపాధి అవకాశాలు, అక్కడ జరుగుతున్న పరిశోధనలు ఇలా అనేక అంశాలను ర్యాంకులకు కొలమానంగా తీసుకుంటారు. వీటిని సరైన ఫార్మాట్‌లో, సరైన డేటాతో పంపడంలో వర్సిటీలు దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ కారణంతోనే ర్యాంకుల్లో వెనుకబడిపోతున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే వర్సిటీలకు అవగాహన పెంపొందించాలని నిర్ణయించారు.

## రూ.1.02 కోట్ల ప్రమాద బీమా

-మొదటిపేజీ తరువాయి

ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ చేర్చే ఉద్యోగులను సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తమ కుటుంబ సభ్యులుగా భావిస్తుందని తెలిపారు. రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అమలు చేసేందుకు గాను రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకర్లతో సంప్రదింపులు పూర్తయ్యాయన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం వదిలి వెళ్లిన బకాయిలను కూడా ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నామని భట్టి తెలిపారు. ఇప్పటికే సింగరేణి, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, జెన్‌కో పరిధిలోని ఉద్యోగులందరికీ రూ.కోటికి పైగా ప్రమాద బీమాను అందుబాటులోకి తెచ్చామని గుర్తుచేశారు. సింగరేణిలోని 38,000 మంది శాశ్వత ఉద్యోగులతో పాటు విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న 71,387 మంది ఉద్యోగులకు ప్రమాద బీమా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఇదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు సైతం రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అమల్లోకి తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 5.14 లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని భట్టి వివరించారు.

## మొదలైన రద్దీ

-మొదటిపేజీ తరువాయి

మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్–నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని.. నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని.. వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

ప్రతి ఆదివారం చౌటుప్పల్‌లో సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమం.

మొదలైన రద్దీ

శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు.

## సైబర్ నేరాలపై ఇంటి నుంచే ఎఫ్ఐఆర్



హైదరాబాద్

నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాలకు గురయ్యేవారు ఇకపై పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన పనిలేదు. ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందేందుకు అనువుగా 'సీ–మిత్ర'ను అందుబాటులోకి తెచ్చారు. అన్ని రోజుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉండేలా 24 మందితో కూడిన హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. సైబర్ నేరాల బాధితులు ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందేందుకు వీలుగా బషీర్‌బాగ్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) కార్యాలయంలో 'సీ–మిత్ర' హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం అదనపు సీపీ (నేరవిభాగం) శ్రీనివాసులు, డీసీపీలు అరవింద్‌బాబు, అపూర్వారావు, చంద్రమోహన్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రూపేశ్, వెంకటేశ్వర్లు, కిరణ్‌ఖరే, ఏసీపీ శివమారుతితో కలసి సీపీ సజ్జనార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. రూ.3 లక్షల లోపున్న కేసులను సీ–మిత్రలో జీరో ఎఫ్ఐఆర్ చేసి.. సంబంధిత ఠాణాలకు బదిలీ చేస్తారు. రూ.3 లక్షలకు పైన ఉన్న ఫిర్యాదులను సైబర్ క్రైమ్ ఠాణాలో చేయవచ్చు.

**బాధితులు ఏం చేయాలంటే...**

బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930, ఛఎఎవతీఛతీఱఎవ.స్త్రశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు అందగానే సీ–మిత్ర బృందం ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించి.. ఏఐ సాయంతో ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి బాధితుల వాట్సప్ నంబరుకు పంపుతారు. బాధితులు దాన్ని ప్రింట్ తీసి, సంతకం చేసి 'సైబర్ మిత్ర హెల్ప్‌డెస్క్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, క్రైమ్ పోలీస్‌స్టేషన్, కమిషనర్ ఆఫీస్, బషీర్‌బాగ్ హైదరాబాద్ 500029' చిరునామాకు పంపవచ్చు. స్టేషన్ బయట డ్రాప్ బాక్స్‌లోనూ వేయవచ్చు. హెల్ప్‌డెస్క్ అధికారిక ఫోన్ నంబరు 040–41893111తో మాత్రమే సీ–మిత్ర నుంచి కాల్స్ వస్తాయి. వాట్సప్ ద్వారా పంపేందుకు 87126 సిరీస్ నంబర్లు మాత్రమే ఉపయోగిస్తారు. సీ–మిత్ర పేరుతో వచ్చే నకిలీ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు.

# జీతం రాని జీతగాళ్లు

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన చెల్లింపుల ప్రక్రియ అత్యంత గందరగోళంగా మారింది. సాధారణంగా ఉద్యోగులకు నెలవారీగా వేతనాలు అందాల్సి ఉండగా...ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం నెలల తరబడి జీతాల జాడ లేకుండా పోయింది. ఈ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అసలే అరకొర వేతనాలు ఇస్తున్నప్పటికీ... వాటిని నెలల తరబడి చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని, కుటుంబ సభ్యులు పస్తులుండాల్సి వస్తోందంటూ ఉద్యోగులు తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు అందకపోవడంతో సంక్రాంతి పండుగ సైతం జరుపుకునే పరిస్థితి లేదంటూ తమ దీన స్థితిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు 5లక్షల మంది ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి నెలకు సగటున రూ.22 వేల నుంచి రూ.31వేల వరకు ప్రభుత్వం వేతనాల రూపంలో చెల్లిస్తుండగా... పన్నులు, ఇతరత్రా కోతలు పోగా చేతికందేది కేవలం రూ.13వేల నుంచి రూ.20వేలు మాత్రమే. ఈ వేతనాలు సైతం నెలలుగా చెల్లించకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఏజెన్సీల చేతిలో మాయ: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతన చెల్లింపుల్లో ఏజెన్సీ పాత్రే కీలకం. ఉద్యోగుల వేతన నిధులను ప్రభుత్వం నేరుగా ఉద్యోగులకు కాకుండా సంబంధిత ఏజెన్సీలకు విడుదల చేస్తుంది. ఆ నిధుల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్, జీఎస్టీ, ఏజెన్సీ కమిషన్, ఇతర పన్నుల కింద చేయాల్సిన చెల్లింపులను పూర్తి చేసిన తర్వాత మిగులును మాత్రమే ఉద్యోగి ఖాతాలో జమ చేస్తారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేసినా... చెల్లింపులు చేయడంలో ఏజెన్సీలు నిర్లక్ష్యం చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు, సచివాలయంలోని ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతన చెల్లింపుల్లో పెద్దగా జాప్యం లేనప్పటికీ... జిల్లాలు, మండల స్థాయి కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం వేతన చెల్లింపుల ప్రక్రియ పూర్తిగా గాడి తప్పింది. కొన్నిచోట్ల 9 నెలలుగా వేతనాలు చెల్లించని పరిస్థితి నెలకొంది. దీంతో ఉద్యోగులు తమ వేతన చెల్లింపుల జాప్యంపై ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదులు ఇవ్వడంతో పాటు చాలా చోట్ల క్షేత్ర స్థాయి కార్యాలయాల్లో నిరసనలు సైతం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనివేళలు ముగిసినా వేతనాలు చెల్లించనందున కార్యాలయ ఆవరణలోనే పడిగాపులు కాస్తున్నారు. మరికొన్ని చోట్ల




నిరసనలకు దిగుతున్నారు.

**ఇదీ పరిస్థితి...**

నీటి పారుదల శాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు 6నెలలుగా వేతనాలు విడుదల కాలేదని అక్కడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. గతేడాది ఏప్రిల్ నుంచి ఆయా ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ సైతం చెల్లించలేదు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 339 మంది ఉద్యోగులకు 7నెలలుగా వేతనాలు అందలేదు.

బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని ఉద్యోగులకు ఆరునెలలుగా, ఎస్సీ వసతి గృహాల్లో పని చేస్తున్న వాచ్‌మెన్, కామాటిలకు 9నెలలుగా వేతనాలు అందలేదు.

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న 770 మంది ఉద్యోగులకు 5నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది.

ఎస్సీ గురుకుల సొసైటీలో ఐఎఫ్ఎంఎస్‌లో రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఆర్నెళ్ల వేతనాలు నిలిచిపోయాయి.

కాగజ్ నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 5నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు.

**రాష్ట్ర వ్యాప్త ఆందోళన నిర్వహిస్తాం**

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతాలు చెల్లించాలి. ఒక్క నెల కూడా పెండింగ్‌లో పెట్టొద్దు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పేర్లు ఐఎఫ్ఎంఐఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) పోర్టల్‌లో ఎక్కించలేదనే కారణంతో జీతాలు నిలిపివేశారు. ఏ కారణం ఉన్నా జీతాలు ఆపేందుకు వీలు లేదు. వచ్చే వార్షిక సంవత్సరం నుంచి ఏజెన్సీ విధానాన్ని మార్చి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాకు వేతనాలు చెల్లించాలి. ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం. పులి లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

**19 రోజులుగా సమ్మె చేస్తున్నాం**

మాకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. అయినప్పటికీ ఎంతో ఓపిగ్గా విధులు నిర్వహిస్తున్నాం. వేతనాలు చెల్లించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

